క్లుప్తంగా

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు



మాట్లాడుతున్న ఏఓ వెంకటస్వామి

పీసీపల్లి: రాయితీపై పంపిణీ చేసేందుకు పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి జి.వెంకటస్వామి తెలిపారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆర్‌బీకేల సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఏఓ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 50 శాతం రాయితీపై పంపిణీ చేసేందుకు ఆర్బీకేల్లో 37 క్వింటాళ్ల జనుములు, జీలుగ, పిల్లి పెసర విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని వివరించారు. 2024-25 ఖరీఫ్‌కు సంబంధించి పచ్చిరొట్ట పైర్ల విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే 2023-24 రబీ లో కరువుతో పంట నష్టపోయిన రైతుల జాబితాను ఈ నెల 25లోగా తహసీల్దార్‌కు అందజేయాలని సూచించారు.

ఉపాధి కూలీలకు పనిముట్లు అందించాలి



కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘ ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు

హనుమంతునిపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి కూలీలకు పనిముట్లు ప్రభుత్వమే అందించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు కోరారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం హాజీపురం, దొడ్డిచింతల గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులు పరిశీలించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

వైభవంగా లక్ష్మీచెన్నకేశవ స్వామి కళ్యాణం



లక్ష్మీ చెన్నకేశవస్వామి కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

హనుమంతునిపాడు: మండల పరిధిలోని నల్లగండ్ల పంచాయతీ చిన్నగొల్లపల్లి గ్రామం నాగులేటి ఒడ్డున కొలువైన శ్రీలక్ష్మీ చెన్నకేశ్వస్వామి కళ్యాణ మహోత్సవం సోమవారం వైభంగా నిర్వహించారు. ఉభయదాతలుగా గాయంవారిపల్లి, గుంటూరుకు చెందిన చెక్కా కుటుంబీకులు వ్యవహరించారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



నాయకులతో మాట్లాడుతున్న ఎస్సై శివబసవరాజు

మర్రిపూడి: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, అల్లర్లకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని ఎస్సై శివబసవరాజు హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం రాజకీయ పార్టీ నాయకులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గెలుపోటములపై రెచ్చగొట్టేలా మెసెజ్‌లు పెట్టడం, ఫ్లెక్సీలు, కటౌట్‌లు ఏర్పాటు చేయడం లాంటివి మానుకోవాలని సూచించారు. కౌంటింగ్ రోజు ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా ఉంటూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులకు సహకరించాలని కోరారు.

వేసవి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం

కొండపి(సింగరాయకొండ): కొండపిలోని ఇన్నోవేటివ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వేసవి ఉచిత శిక్షణా తరగతులను పశుసంవర్థక శాఖ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ పి.బ్రహ్మయ్య ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన కొండపి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు తంగెళ్ల ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి కాలంతో పరిగెడితేనే లక్ష్యం అందుకోగలరని అన్నారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలంటే ప్రతి విద్యార్థి చక్కని చేతి రాత అవసరమని చెప్పారు. శిక్షణలో నేర్చే ప్రతి అంశాన్ని గ్రామీణ ప్రాంత చిన్నారులు వినియోగించుకోవాలని కోర్స్ డైరెక్టర్ ఎల్.వి ప్రసాద్ కోరారు.

కార్డన్ సెర్చ్‌లో వాహనాలు సీజ్

సింగరాయకొండ(మర్రిపూడి): కొండపి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సోమవారం ఉదయం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సింగరాయకొండ మండలం మూలగుంటపాడు పంచాయతీ వెంకటేశ్వరకాలనీలో ధ్రువీకరణ పత్రాలు లేని 16 మోటారుసైకిళ్లను సీజ్ చేసినట్లు సీఐ దాచేపల్లి రంగనాథ్ తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ లోపు మరిన్ని ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టనున్నట్లు సీఐ వెల్లడించారు. సింగరాయకొండ, టంగుటూరు ఎస్సైలు టి.శ్రీరామ్, పున్నారావు, ఏఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

■ **మర్రిపూడి:** మండలంలోని జువ్విగుంట గ్రామంలో కొండపి సీఐ పాండురంగారావు ఆధ్వర్యంలో కొండపి సీఐ పాండురంగారావు ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ధ్రువీకరణ



మర్రిపూడి : ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలతో సీఐ పాండురంగారావు

పత్రాలులేని 20 వాహనాలను గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కొండపి, మర్రిపూడి, పొన్నలూరు ఎస్సైలు శివబసవరాజు, కృష్ణబాజీరావు, వెంకటరాజేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



సీఎస్‌పురంలో కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ రామానాయక్, పక్కన ఎస్సైలు

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

సీఎస్‌పురం(పామూరు): మండల కేంద్రమైన సీఎస్‌పురంలో సీఐ ఎం.రామానాయక్ ఆధ్వర్యంలో సీఎస్‌పురం, పామూరు, వెలిగండ్ల ఎస్సైలు కార్డన్ సెర్చ్ చేపట్టారు. సీఎస్‌పురంలో అనుమానాస్పద వ్యక్తుల గృహాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. జూన్ 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, పోస్టింగులు పెట్టినా, గ్రామాల్లో పాత కక్షలు పెట్టుకుని అల్లర్లకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు రౌడీషీట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. సీఎస్‌పురం, పామూరు, వెలిగండ్ల ఎస్సైలు ఎం.ప్రేమ్‌కుమార్, ఎం.సైదుబాబు, శివ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులు వినియోగించాలి

కందుకూరు: ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి భూసారాన్ని పెంపొందించుకోవాలని మండల వ్యవసాయాధికారి వీ రాము సూచించారు. పీఎం ప్రణం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని మాచవరంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పచ్చిరొట్ట విత్తనాలైన పిల్లిపెసర, జనుము, జీలుగ వంటి పైర్లను సాగుచేసి పూత దశలో భూమిలో కలియదున్నాలని కోరారు. దీని వల్ల భూమిలో కర్బన్ శాతం పెరిగి భూసారం పెరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం వ్యవసాయ శాఖ ద్వారా 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. జనుము జీలుగ విత్తనాల పూర్తి ఖరీదు రూ.88 కాగా సబ్సిడీ పోను రూ.44లకు, పిల్లిపెసర పూర్తి ఖరీదు రూ.134 కాగా సబ్సిడీపై రూ.67లకే రైతులకు ఇస్తారని తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు ముందుగా రైతు భరోసా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకుని, నగదు చెల్లించి విత్తనాలు తీసుకోవచ్చన్నారు. కందుకూరు మండలానికి జనుము 151 క్వింటాళ్లు, పిల్లిపెసర 34 క్వింటాళ్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో మాచవరం, మోపాడు గ్రామ వ్యవసాయ సహాయకులు సిహెచ్ రోనీరేచల్, ఇ రమణయ్యలు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన

లింగసముద్రం: సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నామని మండల వ్యవసాయాధికిరి టి.అబ్రహంలింకన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 13 రైతుభరోసా కేంద్రాల పరిధిలోని రైతులకు పీఎం ప్రణం పోగ్రాం కింద ఈనెల 21 నుంచి 28వ తేదీ వరకు రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు వాడకంపై భూసార పరిరక్షణకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు చెప్పారు. 21న ముత్యాలపాడు, పెదపవని-1, 22న పెదపవని-2, చినపవని, 23న అన్నెబోయినపల్లె, వీఆర్ కోట, 24న మాలకొండ్రాయునిపాలెం, తిమ్మారెడ్డిపాలెం, 25న యర్రారెడ్డిపాలెం, లింగసముద్రం-1, 27న లింగసముద్రం-2, పెంట్రాల, 28న మొగిలిచర్ల రైతుభరోసా కేంద్రాల వద్ద అవగాహన సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. మండలానికి 50 శాతం సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలు జీలుగలు 7 క్వింటాళ్లు, జనుములు 97 క్వింటాళ్లు, పిల్లిపెసర్లు 2 క్వింటాళ్లు మొత్తం 106 క్వింటాళ్లు కేటాయించినట్లు తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు తమ సమీపంలోని రైతుభరోసా కేంద్రాల వద్దకు వెళ్లి వ్యవసాయ సహాయకుల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ రాము

31 వరకు 30 పోలీస్ యాక్టు అమలు

కందుకూరు: ఈనెల 31వ తేదీ వరకు కందుకూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో 30 పోలీస్‌యాక్టు అమల్లో ఉంటుందని డీఎస్పీ శ్రీనివాస్ సోమవారం తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా ఎటువంటి సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. వ్యక్తులు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, స్టూడెంట్స్ ఆర్గనైజేషన్స్ ఇలా ఎవరైనా సభలు, సమావేశాలు నిర్వహించుకోవాలంటే ముందుగా పోలీస్ అనుమతి తీసుకోవాలని సూచించారు. లేదంటే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతి, భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

30 పోలీస్ యాక్టు అమలు

ఉలవపాడు: మండల పరిధిలో 30 పోలీసు యాక్టు అమలులో ఉంటుందని ఎస్సై బాజిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాశాంతి పరిరక్షణ లో భాగంగా ఈ నెల 31వరకు యాక్టు అమలులో ఉంటుందన్నారు. ఎవరైనా వ్యక్తులు, వ్యవస్థలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు సభలు, సమావేశాలు, ర్యాలీలు జరుపుకోవాలంటే ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. అనుమతి లేకుండా జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రటనలో ఆయన హెచ్చరించారు.

లింగసముద్రం: ఈనెల 31వ తేదీవరకు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్సై ఎం.బాజీబాబు తెలిపారు.

రక్తదానంతో ప్రాణదానం



గుడ్లూరులో రక్తదానం చేస్తున్న యువకులు

గుడ్లూరు: సినీ నటుడు జూనియర్ ఎన్‌టీఆర్ జన్మదిన వేడుకలను మండల కేంద్రమైన గుడ్లూరులో సోమవారం టీం ఎన్‌టీఆర్ ఫరెవర్ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. యువకులు కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెల్లూరుకు చెందిన న్యూ లైఫ్ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 53 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎన్‌టీఆర్ యూత్ సభ్యులు పారా అశోక్‌కుమార్, కాపులూరి మధు, కర్పూరపు అజయ్‌కుమార్, వినోద్‌లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్వీస్ ఓట్ల పోలింగ్

కందుకూరు: నియోజకవర్గంలో సర్వీస్ ఓట్ల పోలింగ్ కొనసాగుతోంది. ఆర్మీలో పనిచేస్తున్న ఉద్యోగులు తమ ఓటు హక్కును ఒక్కొక్కరుగా వినియోగించుకుంటున్నారు. నియోజకవర్గంలో మొత్తం 66 సర్వీస్ ఓట్లు ఉండగా, సోమవారం నాటికి 26 మంది మాత్రమే తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. సోమవారం కొందరు ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోగా వాటిని స్ట్రాంగ్ రూమ్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో అధికారులు భద్రపరిచారు. జూన్ 4వ తేదీ వరకు సర్వీస్ ఓట్లను ఉపయోగించుకునే అవకాశం ఉందని, ఆర్మీ ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని స్ట్రాంగ్ రూమ్‌లో ఈ సర్వీస్ ఓట్లను భద్రపరుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ చీఫ్ ఏజెంట్‌లు పాల్గొన్నారు.



సర్వీస్ ఓట్లను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరుస్తున్న అధికారులు

ఘనంగా వెంకయ్య స్వామి ఆశ్రమ వార్షికోత్సవం



దాతలను సన్మానిస్తున్న ఆలయ కమిటీ, సిబ్బంది

కొండపి(సింగరాయకొండ): భగవాన్ వెంకయ్య స్వామి ఆశ్రమం ఏర్పాటు చేసి ఎనిమిదేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కొండపిలోని జాళ్లపాలెం రోడ్డులో ఆశ్రమానికి భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. విగ్రహ దాత ఒంగోలు ఏపీజీబీ రమణయ్య ధర్మపత్ని శ్యామల, ఆలయ అభివృద్ధి కోసం సహకరించిన దాతలకు జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

పొగాకు అక్రమ విక్రయం సరికాదు



వేలాన్ని పర్యవేక్షిస్తున్న నిర్వహణాధికారి శ్రీనివాసరావు

టంగుటూరు: పొగాకు బేళ్లను అక్రమంగా కొనుగోలు చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు హెచ్చరించారు. సోమవారం కె.ఉప్పలపాడు క్లస్టరు గ్రామాల రైతులు 395 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 384 కొనుగోలయ్యాయి. 11 బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. గరిష్ఠ ధర కేజీ రూ.306, కనిష్ఠ ధర రూ.205, సరాసరి ధర రూ.251.61 పలికింది. వేలంలో మొత్తం 37 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి తెలిపారు.

పెచ్చులూడిన ఓవర్ హెడ్ ట్యాంక్

● తప్పిన ప్రమాదం



పెచ్చులూడిన మంచి నీటి ట్యాంకు



దెబ్బతిన్న రేకుల షెడ్

టంగుటూరు: టంగుటూరు సచివాలయం ఆవరణలో ఓవర్ హెడ్ ట్యాంక్ పెచ్చులూడి పారిశుధ్య కార్మికులు కూర్చునే రేకుల షెడ్‌పై పడిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఆ సమయంలో కార్మికులు అక్కడ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఓవర్ హెడ్ ట్యాంక్‌కు మరమ్మతులు చేయించేందుకు ఇటీవల నీటి సరఫరా నిలివేశారు. ట్యాంక్ శ్లాబు కొంత భాగం విరిగి సచివాలయ ఆవరణలోని రేకుల షెడ్‌పై పడటంతో కొంత మేర దెబ్బతింది. పంచాయతీ కార్యదర్శి నర్రా జగదీష్‌బాబు మాట్లాడుతూ.. ట్యాంకు చుట్టూ ఫెన్సింగ్ వేయించి, వేగంగా మరమ్మతు పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

11 మంది జూదరుల అరెస్టు

కందుకూరు: వలేటివారిపాలెం మండలంలోని రోళ్లపాడు గ్రామంలో రహస్యంగా జరుగుతున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి పలువురు పేకాట రాయుళ్లను అరెస్టు చేశారు. గుడ్లూరు సీఐ బీవీ సుబ్బారావుకు వచ్చిన సమాచారం మేరకు రాళ్లపాడులోని పేకాట శిబిరంపై సిబ్బందితో కలిసి దాడి చేశారు. దాడిలో 11 మంది పేకాట రాయుళ్లతో పాటు, రూ 73,230లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులను కోర్టులో హాజరపర్చనున్నట్లు సీఐ తెలిపారు.

వైఎస్సార్ సీపీ నేతలతో దద్దాల భేటీ



రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ సత్యన్నారాయణరెడ్డితో దద్దాల, పార్టీ నేతలు

కనిగిరి రూరల్: జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి వైఎస్సార్ సీపీ అభ్యర్థి శివప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు, ఏపీ రెడ్డి కార్పొరేషన్ చైర్మన్, పార్టీ కనిగిరి నియోజకవర్గ పరిశీలకుడు చింతలచెరువు సత్యన్నారాయణరెడ్డిని ఆ పార్టీ కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ సోమవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కనిగిరిలో రాజకీయ పరిస్థితులపై చర్చించారు. కనిగిరిలో మళ్లీ వైఎస్సార్ సీపీ జెండా ఎగరేస్తామని దద్దాల ధీమా వ్యక్తం చేశారు. దద్దాల వెంట జెడ్పీటీసీల సంఘ అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, రవికుమార్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, వివిధ మండలాల పార్టీ నాయకులు ఉన్నారు.



మాజీ ఎమ్మెల్యే బాబూరావుతో దద్దాల

భూ పోరాట యోధుడు నాగేశ్వరరావు

కొండపి(సింగరాయకొండ): రైతు సమస్యలపై కమ్యూనిస్టు నేత కొల్లి నాగేశ్వరరావు అలుపెరుగని పోరాటం చేశారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన కొండపిలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నాగేశ్వరరావు నాలుగో వర్ధంతి సభ నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ.. చల్లపల్లి జమిందార్ మిగులు భూములు పంచడంలో రాజేశ్వరరావు, దాసరి నాగభూషన్‌తో కలిసి నాగేశ్వరరావు చేసిన పోరాటం మరువలేనిదన్నారు. నాగేశ్వరరావు రచించిన జలదర్శిని పుస్తకాన్ని దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఆవిష్కరించి, దాని విశిష్టతను కొనియాడారని గుర్తుచేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి లక్ష్మి, చంద్రయ్య, మాల కొండయ్య, సాయి,సుబ్బారావు, అరుణ, శేషమ్మ, మల్లీశ్వరి, వసంత, సుబ్బరత్నం తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి

హంస వాహనంపై వేణుగోపాలుడు





హంస వాహనంపై ఊరేగుతున్న వేణుగోపాలుడు, స్వామి వారికి చప్పరసేవ

ఉలవపాడు: రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేణుగోపాలుడు ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హంస వాహనంపై పురవీధుల్లో తిరుగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం ఉదయం 10 గంటలకు చప్పర సేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

జెడ్పీ హైస్కూల్లో ఇంటర్మీడియెట్ కోర్సులు

హనుమంతునిపాడు: మండల కేంద్రం హనుమంతునిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియెట్ కోర్సుల నిర్వహణకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఆ పాఠశాల హెచ్‌ఎం జీవీ సురేష్‌బాబు సోమవారం ఒక ప్రకటలో తెలిపారు. ఇంటర్మీడియెట్‌లో చేరే విద్యార్థులకు జూన్ 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఎంపీసీ, సీఈసీ గ్రూపులో 40 సీట్లు ఉన్నాయని చెప్పారు. మండలంలో పదో తరగతి పూర్తి చేసిన బాల బాలికలు ముందుగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందించాలి

సింగరాయకొండ(మర్రిపూడి): పేద ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందించాలని జిల్లా ప్రోగ్రాం అధికారి వాణిశ్రీ వైద్య, ఆరోగ్య సిబ్బందికి సూచించారు. సింగరాయకొండ మండలంలోని శానంపూడి, ఊళ్లపాలెం విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్లను ఆమె సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులను పరిశీలించి సెంటర్లలో కార్యక్రమాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకుని వారికి తగిన సూచనలు చేశారు. ఎమ్ఎల్‌హెచ్‌పీ రవినాయక్, రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



శానంపూడి హెల్త్ క్లినిక్ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీపీఓ వాణిశ్రీ

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ఉలవపాడు: మండల కేంద్రం ఉలవపాడులోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. మొత్తం 39 మంది క్విజ్ పోటీల్లో పాల్గొన్నారు. విద్యార్థుల్లో మేధోశక్తిని వెలికితీసే క్రమంలో భాగంగా ఈ పోటీలు నిర్వహించారు. నీతికథలు, జనరల్ నాలెడ్జి, పాఠ్య పుస్తకాలలో నుంచి క్విజ్‌పోటీలకు సంబంధించి ప్రశ్నించారు. ముందుగా విద్యార్థుల చేత మహనీయుల చరిత్రలు, నీతికథలు చదివించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావుతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



ఉలవపాడు గ్రంథాలయంలో క్విజ్ పోటీలు